సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025

I



చేతికొచ్చే దశలో..!

పంటలు చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలకు వరి పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. వివరాలు IIలో ▸



క్రీడలు జీవిత పాఠాలు..

క్రీడలు జీవిత పాఠాలు నేర్పుతాయని, కబడ్డీలో గొప్ప ప్రతిభ చూపిస్తున్నారని డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. వివరాలు IIలో ▸



నిలిచిన రోడ్డు పనులు

అల్లాదుర్గ్– మెటకుంట ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

రేవంత్ ఫార్ములా అమలైంది

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



పార్టీ నేతలతో చింతా ప్రభాకర్

సంగారెడ్డి : ఆపరేషన్ విజయవంతమైనా రోగి మరణించాడు అనే రేవంత్‌రెడ్డి ఫార్ములా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో పక్కాగా అమలైందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పార్టీ నేతలు చింతా ప్రభాకర్‌ను కలిసి తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడిన దృష్ట్యా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయా మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.

సులభమైన పద్ధతిలో బోధించాలి: డీఈఓ



శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏఐ, కోడింగ్, పైథాన్ పై మూడు రోజుల్లో పాటు జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి నాగేశ్వరావు నాయక్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉపాధ్యాయులకు ఫిజికల్ కంప్యూటింగ్ కోర్స్‌ల తోపాటు కోడింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పై విద్యార్థులకు బోధించేందుకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో గణితం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకం రైతులకు వరం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పండరీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న పండరీ

జహీరాబాద్ టౌన్: తేనెటీగల పెంపకం రైతులకు వరంలాంటిదని జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమల విభాగం జిల్లా అధికారి సీహెచ్.పండరీ పేర్కొన్నారు. జహీరాబాద్ సమీపంలోని కేవీకే ఆవరణలో గురువారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పండరీ మాట్లాడుతూ...తేనెటీగల పెంపకం ద్వారా అధిక ఆదాయం ఆర్జించవచ్చన్నారు. రైతులు వ్యవసాయంతోపాటు తేనెటీగల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. తేనెటీగల పెంపకాన్ని చేపట్టి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉచిత శిక్షణనిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేవీకే సీటీవో వరప్రసాద్, కేవీకే శాస్త్రవేత్తలు స్నేహలత, శైలజ, హేమలత, రమేశ్ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న కళాకారులు

జహీరాబాద్ టౌన్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని జహీరాబాద్‌లోని డీసీఎంఎస్ కాంప్లెక్స్ వద్ద ప్రతిష్ఠించిన దుర్గాభవానీ మాత విగ్రహాన్ని పౌర్ణమి తర్వాత నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో నిర్వహించిన శోభాయాత్రలో కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. శోభయాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీజీ ఎంట్రెన్స్‌లో 37వ ర్యాంకు

గజ్వేల్‌రూరల్: ఓయూ(ఉస్మానియా యూనివర్సిటీ) నిర్వహించిన పీజీ ఎంట్రెన్స్‌లో గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని బాటని సబ్జెక్టులో 37వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి చెందిన విద్యార్థిని మౌనిక కళాశాలలో బీజెడ్‌సీ ఇంగ్లిష్ మీడియం తృతీయ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు.

అభ్యర్థుల ఉత్సాహంపై నీళ్లు

వాయిదా పడిన 'స్థానిక' సంస్థల ఎన్నికలు

బీసీ రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆసక్తిరమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. తొలి విడతలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు గురువారం ఉదయం 10.30గంటల నోటిఫికేషన్ జారీ అయ్యాయి. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రిటరి్నంగ్ అధికారులు ప్రకటించారు. తీరా సాయంత్రం ఈ స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు సంబంధించిన జీవో నం.9పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో ఈ ఎన్నికల నిర్వహణకు ప్రక్రియ వాయిదా పడింది. దీంతో ఈ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన అభ్యర్థుల ఉత్సాహంపై నీళ్లు చల్లినట్లయింది.



అయోమయం.. ఉత్కంఠ

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కలిస్తూ ప్రభుత్వం జీవో నం.9ని జారీ చేసింది. ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు గురువారం ఈ జీవో నం 9పై స్టే విధించింది. కౌంటర్లు దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి, పలువురు పిటీషనర్లకు ఆరు వారాల పాటు గడువు విధించింది. దీంతో ఎన్నికల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేకు పడినట్లయింది. అయితే ఈ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన నాయకుల్లో ముందు నుంచి అయోమయమే నెలకొంది. ఈ ఎన్నికల విషయంలో కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై ఉత్కంఠగా ఎదురు చూశారు. రిజర్వేషన్లు అనుకూలించిన వారు పోటీకి సిద్ధమయ్యారు. నామినేషన్ వేసేందుకు అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకున్నారు. మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, నాయకులు పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేశాయి. టికెట్ల రేసులో ఇద్దరు, ముగ్గురు ఉన్న చోట్ల ఏకాభిప్రాయానికి ప్రయత్నించారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టులో విచారణ నేపథ్యంలో నామినేషన్ వేసేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు.

పత్తి కొనుగోళ్లకు కపాస్ కిసాన్

- యాప్‌లో నమోదు చేసుకుంటేనే మద్దతు ధర
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో అందుబాటు



సంగారెడ్డి జోన్: పత్తి కొనుగోలు, అమ్మకాలలో అక్రమాలకు తావు లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో వాణిజ్య పంటలలో ప్రధానంగా పత్తి పంట సాగవుతోంది. పత్తి పంట రంగు మారిందని, నాణ్యత లేదని కొర్రీలు చూపిస్తూ రైతుల నుంచి దళారులు దోపిడీకి పాల్పడేవారు. కొనుగోలు చేసే సమయంలో తూకం సరైన విధంగా చేయకపోవడం, కొనుగోలు చేసిన తర్వాత సమయానికి డబ్బులు ఇవ్వకపోవడం తదితర మోసాలకు దళారుల ఇష్టారాజ్యానికి చెక్ పెట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కు అనుసంధానం చేస్తూ కపాస్ కిసాన్ యాప్‌ను కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రైతులకు తాము పండించిన పత్తి పంట సులభంగా కొనుగోళ్లు జరుపుకునేందుకు వీలుగా ఉంటుంది. దీనిపై మార్కెటింగ్ శాఖతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నమోదు తప్పనిసరి

సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర పొంది పంటను అమ్ముకోవాలంటే ఈ కపాస్ కిసాన్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులందరికీ ఉపయోగపడేలా తీసుకొచ్చిన ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. అయితే ఈ యాప్‌ను అందరికీ అందుబాటులోకి ఉంచినప్పటికీ ఈ యాప్‌లో నిరక్షరాస్యులైన రైతులు ఎంత మంది నమోదవుతారనే అనుమానాలు తెరపైకి వస్తున్నాయి.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

జహీరాబాద్ టౌన్: బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ వారిని మోసం చేసిందని బీసీ సంఘం నాయకులు ఆరోపించారు. పట్టణంలో గురువారం విలేకరుల సమావేశంలో బీసీ సంఘం నాయకులు కొండపురం నర్సింహులు,పెద్ద గొల్ల నారాయణ, విశ్వనాథ్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ...బీసీలకు లభించిన 42% రిజర్వేషన్‌ను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించిన రిజర్వేషన్‌ను రెడ్డి జాగృతి నాయకులు కేసులు వేసి ఆపడం శోచనీయన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌కు రాబోయే రోజుల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాచన్న, రమేశ్, అంబదాస్, గణేశ్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి టౌన్ : పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని గురువారం బాలసదన్‌లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు క్రమశిక్షణతో మెలిగి చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. న్యాయపరమైన విషయంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో మాట్లాడుతున్న సౌజన్య

రాష్ట్రస్థాయి పోటీలకు ఖాదిరాబాద్ విద్యార్థులు



ట్రోఫీతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఖాదిరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి అండర్–17 వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ఖాదిరాబాద్ విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. దీనిలో భాగంగానే నారాయణఖేడ్ పట్టణంలో జరిగిన పోటీల్లో పాల్గొని గుమ్మడిదల జట్టుపై విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.దిగంబర్‌రావు, పీఈటీ ఎల్.సంగ్రాంలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు..

జహీరాబాద్: త్వరలో జిల్లా స్థాయిలో జరగనున్న వాలీబాల్ పోటీలకు జహీరాబాద్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు అబ్దుల్ రహీం, మునీరుద్దీన్ ఎంపికయ్యారు. ఈ మేరకు అల్గోల్ మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జె.రాములు, ఇన్‌చార్జి కె.ఎస్.జమీల్ గురువారం విలేకరులకు వెల్లడించారు. ఖేడ్‌లో నిర్వహించిన పోటీల్లో అండర్–17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పీఈటీ అనిల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్‌గౌడ్, విద్యార్థులను వారు అభినందించారు.



ఏటీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సాధనతోనే లక్ష్యాన్ని చేరుకోవాలి

హత్నూర ఏటీసీని పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య

హత్నూర (సంగారెడ్డి): విద్యార్థులు ఏకాగ్రతతో సాధన చేసి చదువుకుని తమ లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన హత్నూర ఐటీఐ ఆవరణలో ఇటీవల ప్రారంభించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఏటీసీలో కొనసాగుతున్న బోధనా విధానం, విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న కోర్సులు, టెక్నాలజీ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సాంకేతిక నైపుణ్యం కలిగిన విద్యార్థులకే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఏటీసీ ద్వారా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. అనంతరం హత్నూర ఐటీఐ భవనంతోపాటు మెషీన్ షెడ్లను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు పంపించాలని ఐటీఐ ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మికి సూచించారు. అవసరమైతే మరమ్మతులతోపాటు పూర్తిగా పనికిరాని భవనాలను కూల్చివేసి నూతన భవనాలు నిర్మించేందుకు పరిశ్రమల సహకారం తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీఓ శంకర్, ఎంపీఈఓ యూసుఫ్, డాక్టర్ రజినితోపాటు ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. రోగులకు అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందించాలని అవసరమైతే మందులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వైద్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కోతల రోడ్డుకు మరమ్మతులేవి?



కల్హేర్–పిట్లం మధ్యలో కోతకు గురైన రోడ్డు

- వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న సంగారెడ్డి–కామారెడ్డి సరిహద్దు రోడ్డు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

కల్హేర్(నారాయణఖేడ్): సంగారెడ్డి–కామారెడ్డి జిల్లాల మధ్య దూరాభారాన్ని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన సరిహద్దు రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్హేర్, పిట్లం మండల కేంద్రం మధ్యలో రోడ్డు బాగా దెబ్బతింది. దీంతోపాటు మహరాజు వాగు వద్ద రోడ్డు కోతకు గురైంది. మరి కొన్ని చోట్లరోడ్డు ధ్వంసమైంది. వాహనాలు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోయింది. రోడ్డు కోతకు గురైన చోట ద్విచక్రవాహనాలపై ప్రయాణించడం కూడా ఇబ్బందికరంగా మారింది. ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు వెచ్చించి రోడ్డును మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బీటీ రెన్యూవల్ పనులు హుష్‌కాకి

బీటీ రెన్యూవల్ పనుల కోసం ఉన్న రోడ్డును తవ్వేశారు. తెల్ల కంకర వేసి రహదారి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అర్ధంతరంగా పనులు నిలిపివేయడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. మరో పక్క నల్లవాగు వంతెన దగ్గర నుంచి కామారెడ్డి జిల్లా పరిధిలో పిట్లం వరకు మట్టి రోడ్డు అధ్వాన్నంగా మారిపోయింది. మహరాజు వాగుపై నిర్మించిన వంతెన దెబ్బతిని ఇనుపచువ్వలు బయటకు వచ్చాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా పరిణమించింది.



కల్హేర్–పిట్లం మధ్యలో వరద నీటి ప్రవాహంతో దెబ్బతిన్న జిల్లా సరిహద్దు రోడ్డు

ప్రమాదకరంగా మారింది



కల్హేర్, పిట్లం మండల కేంద్రాల మధ్యలో ప్రయాణం కష్టంగా మారింది. రోడ్డు కోతకు గురైన చోట ప్రమాదకరంగా మారింది. వంతెన వద్ద రోడ్డు దెబ్బతినడంతో సర్కాస్‌ఫీట్లు తప్పడంలేదు. రోడ్డు బాగు పడితే ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. రోడ్డును వెంటనే మరమ్మతు చేసి పునరుద్ధరించాలి.

– నాగరాజు, కల్హేర్

ఒక అడుగు ముందుకు... రెండడుగులు వెనక్కి

బీడు భూములకు ఎత్తిపోతల ద్వారా నీటిని అందించి వాటిని సస్యశ్యామలంగా మార్చాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలు అటకెక్కినట్లే అనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాల ఊసే ఎత్తడం లేదు. ఈ పథకం పురోగతి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది.

- అటకెక్కిన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు
- పథకం అమలుపై ఊసెత్తని ప్రభుత్వం



కంకోల్ వద్ద సంప్‌హౌజ్‌కు భూమిపూజ చేస్తున్న నాటి మంత్రి హరీశ్‌రావు(ఫైల్)

జహీరాబాద్: జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాలకు సాగునీటిని అందించేందుకు వీలుగా బసవేశ్వర పథకానికి అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఖేడ్‌లో భూమిపూజ చేశారు. జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాల్లోని 11 మండలాలకు సాగు నీటిని అందించేందుకు వీలుగా సంగమేశ్వర ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. 2021లో ఆయా ప్రాజెక్టులకు అనుమతులు లభించాయి. 21 ఫిబ్రవరి 2022లో ఖేడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఆయా పథకాలకు గాను రూ.4,500 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి సింగూరుకు నీటిని మళ్లించి 20 టీఎంసీల వినియోగంతో 3.84లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రెండు ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం చేపట్టింది. సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి గాను 6,293 ఎకరాల భూమి అవసరం అవుతుందని, రూ.2,653 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని అంచనా వేశారు. అయినా ఇప్పటివరకు భూసేకరణ ప్రక్రియను మొదలు పెట్టలేదు.

జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని 11 మండలాలకు చెందిన 231 గ్రామాల్లోని 2.19లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలోని 115 గ్రామాల్లో 1,03,259 ఎకరాలకు సాగు నీటిని అందించాలని ప్రతిపాదించారు. అందోల్ నియోజకవర్గంలోని రెండు మండలాల పరిధిలో 66 గ్రామాలకు చెందిన 65,816 ఎకరాలకు, సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 50 గ్రామాల్లోని 49,925 ఎకరాలకు సాగు నీరందించాలని నిర్ణయించారు. ఇందుకోసం 12 టీఎంసీల నీటిని ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. నారాయణఖేడ్ నియోజకవర్గానికి సాగు నీటిని అందించేందుకుగాను బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఈ పథకం కింద 8 టీఎంసీల నీటితో 1,65లక్షల ఎకరాలకు నీటిని అందించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.1,774కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. 14 జూన్ 2021లో సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించి అందోల్ నియోజకవర్గంలోని కంకోల్‌లో సంప్‌హౌజ్, 21 జూన్ బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన సంప్‌హౌజ్ నిర్మాణానికి, అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆయా పథకాలకు గ్రహణం పట్టింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా ప్రాజెక్టుల విషయంలో గత 8నెలల క్రితం ఎర్రవల్లిలోని తన ఫాంహౌజ్‌లో జహీరాబాద్ ప్రాంత నేతల సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే.

2.19 లక్షల ఎకరాలకు సాగునీరు

కోర్టు పరిధిలో ఉన్నందునే జాప్యం



సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి సంబంధించి డ్రాయింగ్, డిజైన్, అలైన్‌మెంట్ పనులకుగాను ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. వాటి పనులను పూర్తి చేసే పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఇతర పనులతో ముందుకు సాగుతాం. ఇంకా భూసేకరణ పనులు ప్రారంభించలేదు. ఈ పథకానికి సంబంధించి సంప్ హౌజ్ ప్రాంతంలోని భూమికి సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉన్నందున జాప్యం జరుగుతోంది.

– విజయ్‌కుమార్, ఈఈ,నీటిపారుదల శాఖ, జహీరాబాద్

జోగిపేట ఆస్పత్రిలో ఆస్కి వైద్య బృందం

జోగిపేట(అందోల్): ఇటీవల రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా జోగిపేట ఆస్పత్రి వద్ద ట్రామా కేంద్రాన్ని ఏర్పాటు చేసే విషయమై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) వైద్యులు గురువారం జోగిపేట ఏరియా ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలు, పరికరాలు, అవసరమైన సదుపాయాలను పరిశీలించి నివేదిక తయారు చేశారు. ఆస్పత్రికి సంబంధించిన పలు వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య వారికి వివరించారు. బృందం సభ్యుల్లో వైద్యులు అభిషేక్, శ్రీ హర్ష, మేఘన,దివ్య, మౌనిక, కీర్తి ఉన్నారు.



ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్య బృందం

క్లుప్తంగా

పాత నేరస్తుల బైండోవర్



పాత నేరస్తులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని పాత నేరస్తులను ఎలక్షన్ కోడ్‌లో భాగంగా గురువారం పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ సైఫ్ అలీ పేర్కొన్నారు. పాత నేరస్తులు, పొలిటికల్ ట్రబుల్ మంగర్స్, రౌడీ షీటర్స్, ఇల్లీగల్ బెల్ట్ షాపు నిర్వాహకులు, అల్లరి మూకలు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన నిందితుడు అరెస్ట్



పోలీసుల అదుపులో నిందుతుడు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేటలో ఇటీవల కంకణాల రాజమణిపై దాడి చేసి పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన నిందితుడిని గురువారం పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమణి ఇంటి సమీపంలో ఉన్న నిందితుడు జూకంటి మల్లారెడ్డి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై దాడి చేసి నాలుగు తులాల పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని పోతారెడ్డిపేట గ్రామ శివారులో పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితుడి నుంచి నాలుగు తులాల పుస్తెల తాడు, ఆమెపై దాడి చేసిన ఇనుప బాటును సీజ్ చేశారు. ఈ మేరకు నిందితుడిపై హత్యాయత్నం, దొంగతనం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తప్పుడు సమాచారం.. కేసు నమోదు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాస్‌పోర్టు విషయంపై గురువారం తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై కేసు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన బద్దు పాస్ పోర్టు విషయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు విచారణ అనంతరం అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ సంస్థలకు తప్పుడు సమాచారం ఇస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

చేతికొచ్చే దశలో..!

- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- తెల్లగా మారుతున్న వరి గొలుసులు
- ఈని గింజలపై పొల్లు ప్రభావం
- మందులు కొట్టినా.. ఫలితం శూన్యమే
- అయోమయంలో రైతులు



వరిచేనులో పురుగుమందు పిచికారీ చేస్తున్న చెల్లాపూర్ రైతు ఎల్లారెడ్డి



తెగులు బారినపడిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పెట్టుబడి మట్టిలో పోసినట్లే..

దుబ్బాక మున్సిపల్ పరధిలోని చెల్లాపూర్‌కు చెందిన రైతు కొండె ఎల్లారెడ్డి 10 ఎకరాల్లో వరి సాగు చేశాడు. వర్షాలకు వరిపంటకు తెగుళ్లు వ్యాప్తి చెందాయి. ఈని గొలుసులు బయటకు వచ్చాక గింజ గట్టి పడకుండా తాలుపోయి తెల్లగా నిలబడిపోతుంది. రకరకాల మందులు పిచికారీతో పాటు పవర్ ఫుల్‌ఎంఢ్రీన్ గోళీలు చల్లినా ఫలితం లేదు. ఫర్టిలైజర్ దుకాణాల్లో మందులను పిచికారీ చేసిన లాభం లేదు. ఇప్పటి వరకు రూ.2 లక్షలు పెట్టిన పెట్టుబడి మట్టిలో పోసినట్లే అయింది.

దుబ్బాక: కోటి ఆశలతో రైతులు సాగు చేసిన పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు వరి గొలుసులు తెల్లగా మారిపోతున్నాయి. ఈ ప్రభావంతో వరి చేలల్లో ఈని గింజలు గట్టిపడకుండా పంటలు పొల్లుపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం అంతంత మాత్రమే ఉందని వాపోతున్నారు. దీంతో పాటు వరికి అగ్గి తెగుళ్లు, ఎండాకు తెగుళ్లు, సుడి దోమ, మొగి పురుగు రోగాలు వ్యాపించడంతో రైతులు అయోమయం చెందుతున్నారు.

తాలు పోతున్న వరి గొలుసులు

రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. పంటలు చేతికొస్తున్న దశలో తెగుళ్లతో నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం వరి చేలు పొట్టదశకు వచ్చి ఈనుతున్న తరుణంలో బయటకు వచ్చిన గొలుసులకు గింజలు గట్టిపడకుండా తెల్లగా తాలు పోతున్నాయి. వివిధ రకాల క్రిమిసంహారక మందులు చల్లినా ఫలితం కనబడకపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

3.63 లక్షల ఎకరాల్లో వరిసాగు..

జిల్లా వ్యాప్తంగా వానకాలంలో సుమారు 3.63 లక్షల ఎకరాల్లో వరిపంటలు సాగయ్యాయి. జిల్లాలోని చాల ప్రాంతాల్లో ముందుగా వేసిన వరి పంటలు ఈని గింజలు ఎర్రబడుతున్నాయి. ఈ క్రమంలో ఈనిన వరి చేలల్లో గొలుసులకు గింజలు పాలుపోసుకోకుండా అలాగే తెల్లబడి నిలబడిపోతున్నాయి. దుబ్బాక మండలంలోనే కాదు.. జిల్లాలోని చాల గ్రామాల్లో వరి పంటల పరిస్థితి దారుణంగా మారిది.

విపరీతంగా ఇష్టమొచ్చిన మందులు...

వరి చేల పై రైతులు విపరీతంగా ఇష్టమొచ్చిన మందులు పిచికారి చేస్తున్నా ఫలితం లేని పరిస్థితి కనబడుతుంది.నాట్లు వేసినప్పుడు వాతవరణ పరిస్థితులతో ఎదగకుండా ఎర్రగా ఉండడంతో అప్పటి నుంచి ఇప్పుడు ఈని గొలుసు తాలుబోతుండడంతో రకరకాల మందులను వేల రూపాయలు పెట్టి తెచ్చి స్ప్రే చేస్తున్నా ఫలితం లేని పరిస్థితి ఏర్పడింది.

తెగుళ్లకు నివారణ..

వరిచేలు ఈని గింజలు గట్టి పడకుండా తాలుపోవడంతో పాటు మొగిపురుగు, ఎండాకు తెగులు, సుడిదోమ, అగ్గి తెగుళ్లలో మెడవిరుపు రోగం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అగ్గి తెగులు సోకిన భూముల్లో ఈ మెడవిరుపు తెగులు లక్షణాలు కనబడుతున్నాయి. ప్రస్తుతం వరిపంటలపై మెడవిరుపు లక్షణాలు కనిపిస్తే ట్రై సైక్లోజన్ లేదా గెలిలియోసెన్స్ మందులు పిచికారీ చేయాలంటూ వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

4 ఎకరాల్లో వరిపంట వేశా



నాలుగు ఎకరాల్లో వరిపంట వేశా. పంట మొత్తం ఈని గొలుసు ఎర్రబడుతుంది. ఈనిన గొలుసు పాలు పోసుకోకుండా గింజ గట్టిపడకుండా తెల్లగా గొలుసులా నిలబడిపోతుంది. చేను గిట్లయితుందని మందు తెచ్చి కొట్టిన. అయినా ఏం లాభం లేదు. చేతికొస్తుందనుకున్న చేను గిట్లకావట్లే. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– పాతూరి లక్ష్మణ్, రైతు దుబ్బాక

వరి పంటలను పరిశీలిస్తున్నాం

వరిపంటలకు రకరకాల తెగుళ్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈని గొలుసులకు తాలుపోతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వరి పంటలను వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలిస్తున్నాం. ఇందులో వరిపంట కోత దశకు వచ్చే సమయంలో అగ్గితెగులు, ఎండాకు తెగులు, సుడిదోమ, మొగిపురుగు తదితర రకాల రోగాలు కనిపిస్తున్నాయి. ఫర్టిలైజర్ అధికంగా వాడడంతో పాటు అధిక వర్షాలు, వాతావరణ పరిస్థితులతో తెగుళ్లు ఎక్కువయ్యాయి.

– డాక్టర్ పల్లవి, వ్యవసాయశాస్త్రవేత్త

‘క్యూనెట్’కు యువకుడి బలి

- సూసైడ్ నోట్ రాసి.. ఉరేసుకుని ఆత్మహత్య
- వేలూరులో ఘటన



హరికృష్ణ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ‘క్యూనెట్ వారు నన్ను మోసం చేశారు. వాళ్లు చెప్పింది ఒకటి.. అందులో చేసేది ఒకటి. నా వాళ్లు నాపై చాలా నమ్మకం పెట్టుకున్నారు.. కానీ నేను ఆ నమ్మకాన్ని కోల్పోయాను. వాళ్లను మోసం చేస్తూ రోజూరోజు బబతకటం నా వల్ల కాదు. ఎవరు కూడా తన జీవితాన్ని తనంతట తాను పాడు చేసుకోరు. పరిస్థితులు ప్రభావం చేస్తాయి.’..అంటూ సూసైడ్ నోట్‌లో ఆవేదన వ్యక్తం చేస్తూ, మల్టీలెవెల్ చైన్ ఫైనాన్స్ సంస్థ ద్వారా మోసపోయానని పేర్కొంటూ ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు.

ఈ ఘటన వర్గల్ మండలం వేలూరులో గురువారం సాయంత్రం జరిగింది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి, కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. వర్గల్ మండలం వేలూరుకు చెందిన బడుగు నాగరాజు, వజ్రమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకొడుకు బడుగు హరికృష్ణ(26) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. రూ. 4 లక్షలు కడితే ప్రతినెల రూ.15,000 చెల్లిస్తామని ‘క్యూనెట్’ అనే మల్టీలెవల్ మార్కెటింగ్, ఫైనాన్స్ కంపెనీ వారి మాటలు నమ్మాడు. తెలిసిన వారి వద్ద రూ. 4 లక్షలు అప్పుచేసి క్యూనెట్ కంపెనీలో చెల్లించాడు. కంపెనీ వారు చైన్‌లింక్‌గా మరో వ్యక్తితో మరో రూ. 4 లక్షలు కట్టిస్తే నీకు నెలకు రూ.15,000 వస్తాయని చెప్పటంతో ఖంగుతిన్నాడు. తాను మోసానికి గురయ్యానని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సంవత్సరం క్రితం కూడా హరికృష్ణ బెట్టింగ్ యాప్‌లో రూ.10 లక్షల వరకు నష్టపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. తాజాగా ‘క్యూనెట్’ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయానని తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. జీవితంలో తాను చేసిన ఏ పని కలిసిరావడం లేదని తీవ్ర మనస్తాపంతో సూసైడ్ లెటర్ రాసి గురువారం సాయంత్రం తన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొనగా మృతుని తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వంట గ్యాస్ లీక్

- వ్యాపించిన మంటలు
- ప్రాణపాయస్థితిలో యువకుడు



గ్యాస్‌లీక్‌తో వ్యాపించిన మంటలు



ఆనంద్ స్వరూప్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంట్లో వంట గ్యాస్ లీకవడంతో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాన్సువాడకు చెందిన కాంట్రాక్టర్ భాస్కర్ రెండేళ్లుగా ఎల్‌ఐజీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాగా గురువారం రాత్రి ఇంట్లో గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో మరో సిలిండర్‌ను అమర్చుతుండగా.. ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయింది. భాస్కర్ సతీమణి మంజుల బయటకు రాగా.. వారి ఒకే ఒక్క కుమారుడు ఆనంద్ స్వరూప్ గ్యాస్ ధాటికి భయపడి మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయాడు. అతడిని వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక దళానికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలన్నీ అదుపులోకి తీసుకొచ్చారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

న్యాల్‌కల్(జహీరాబాద్): పురుగుల మందు తాగు ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం. గ్రామానికి చెందిన మచుకూరి నర్సింహులు కుమారుడు పవన్(19) జహీరాబాద్‌లోని ఓ కార్యాలయంలో పని చేస్తున్నాడు. అయితే బుధవారం విధులకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉన్న పవన్.. రాత్రి పురుగుల మందు తాగు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బీదర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఎస్‌ఐ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు



గాయాలతో గట్టయ్య

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో ఓ రైతుకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని రామవరంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆరె గట్టయ్య (50) తన వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మరమ్మతు చేసే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఎక్కాడు. దీంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. వెంటనే స్థానిక రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ ప్రమాదంలో గట్టయ్య చేతికి, కాలు, శరీరం భాగంలో తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అయితే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కినట్లు అధికారులు చెబుతున్నారు.

బహిరంగంగా లక్కీ లాటరీ నిర్వహణ

కేసు నమోదు చేసిన పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): ప్రజలు ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్న క్రమంలో ఓ వ్యక్తి బహిరంగంగా లాటరీ నిర్వహించాడు. ఈ విషయం తెలుసుకున్న చేర్యాల పోలీసులు లాటరీ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కోరుట్ల జిల్లా జగిత్యాలకు చెందిన ఉబిడి నవీన్ సిద్దిపేటలో నివాసం ఉంటూ పరిసర గ్రామాలు, పట్టణాల్లో లాటరీలు నిర్వహిస్తున్నాడు. గురువారం పట్టణ కేంద్రంలో ‘కంపెనీ వారి దీపావళి డిస్కౌంట్ ఆఫర్’ అని కొన్ని చిట్టీలు వేసి లాటరీ తీస్తున్నారు. ఇందులో రూ.100కు రూ.1000.. రూ.1000కి రూ.10,000లతో పాటు ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులను లాటరీలో ఇస్తామని త్వరపడండి అంటూ ప్రజలను నమ్మిస్తున్నాడు. మొదటగా ఒకరిద్దరికి డబ్బులు ఇచ్చినట్లే ఇచ్చి, ఆ తర్వాత అమాయక ప్రజల నుంచి వేలల్లో వసూలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని లాటరీ నిర్వహిస్తున్న సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని గణేష్ ట్రేడింగ్ కంపెనీలో గురువారం రాత్రి మెదక్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ వాహనంలో ఇతర ప్రాంతాల నుంచి బియ్యం తీసుకొచ్చి రైస్‌మిల్‌లో డంప్ చేస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న సుమారు 52 సంచుల రేషన్‌బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. అదేవిధంగా రైస్‌మిల్‌లోని ఓ గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన మరో 36 సంచులను గుర్తించి గదికి సీల్ వేశారు.

242 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

పటాన్‌చెరు టౌన్: రెండు వేర్వేరు కేసుల్లో 242 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన సంఘటన పటాన్‌చెరు, బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తెల్లాపూర్ మున్సిపాలిటీ రైల్వే స్టేషన్ నుంచి కంటైనర్‌లో దాదాపు 212 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే అధికారులు దాడులు చేసి కంటైనర్‌లో ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామ పరిధిలోని వెంచర్లలో ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పోలీసులు, అధికారుల సహాయంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో హక్యీ, రాజులపై రెండు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో ఉద్యమకారుడు మృతి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని దోమడుగుకి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సంజీవని మల్లికార్జున గౌడ్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉద్యమకారుడిగా ప్రతి ఒక్కరికి సుపరిచితుడైన ఆయన మృతిని ఆయా పార్టీల నాయకులు తట్టుకోలేకపోతున్నారు. మలిదశ పోరాటంలో ఆయన పోరాట పటిమను ప్రతి ఒక్కరు కొనియాడారు. ఈ మేరకు తోటి ఉద్యమకారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.



మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ నర్సింలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహిళ హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని గజ్వేల్ ఏసీపీ నర్సింలు వెల్లడించారు. ఈ మేరకు మండలంలోని బస్వాపూర్‌లో మహిళ హత్య కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన ఆలేటి యాదవరెడ్డి చిన్న కూతురు అపర్ణ.. అదే గ్రామానికి చెందిన అబ్బాస్‌ను ప్రేమించింది. అయితే తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో పది నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి వివాహం చేసుకుని జనగాంలోని కుకునూర్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. మూడు నెలల క్రితం ఇద్దరి మధ్య మనస్పార్థలు రావడంతో తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరుకుంది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కూతురు తిరిగి పోవడంతో ఆగ్రహానికి గురై తల్లిదండ్రులు, బాబాయి ముగ్గురు కలిసి అబ్బాస్ ఇంటిపై దాడికి దిగారు. ఈ దాడిలో యువకుడి తల్లి సాహింబేగంకు తీవ్ర గాయాలై మృతి చెందింది. కుమారుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పలు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, గురువారం ముగ్గురి నిందితులను అదుపులోకి తీసుకుని హత్యకు ఉపయోగించిన ఇనుపరాడు, కర్ర స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణారెడ్డి ఉన్నారు.

ఫ్లై ఓవర్‌పై లారీ పార్కింగ్

- సిగ్నల్స్ కనపడక ఢీకొట్టిన ఆర్టీసీ లగ్జరీ బస్సు
- డ్రైవర్‌తో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారి ఫ్లై ఓవర్‌పై ఎలాంటి ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకుండా పార్కు చేసిన లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు గురువారం తెల్లవారుజామున ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో కుకునూరుపల్లి శివారులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో రాజీవ్ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పార్కింగ్‌చేసిన లారీ కనిపించకపోవడంతో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతినగా.. డ్రైవర్ మహమ్మద్ మదర్‌తో పాటు ప్రయాణికులు మహమ్మద్ సయ్యద్ రమీజ్ అహ్మద్, తోట జయచందర్, వెన్నెల రమేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ గండి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాలీబాల్, ఖోఖో జట్లకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను ఎంపిక చేస్తున్న పీడీలు, కోచ్‌లు

గజ్వేల్‌రూరల్: ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలుర, బాలికల వాలీబాల్, ఖోఖో విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించేందుకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ సమ్మయ్య తెలిపారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో ఉన్న మైదానంలో గురువారం సిద్దిపేట జిల్లా జట్ల ఎంపికను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులను అండర్–19 విభాగంలో వాలీబాల్, ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు బాలుర, బాలికల విభాగంలో క్రీడాజట్లను ఎంపిక చేశామన్నారు. బాలుర విభాగంలో వాలీబాల్‌కు 50మంది, ఖోఖోకు 50మంది క్రీడాకారులు హాజరవ్వగా.. ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున, బాలికల విభాగంలో వాలీబాల్‌కు 45మంది, ఖోఖోకు 30మంది క్రీడాకారులు హాజరవ్వగా.. ఒక్కో జట్టుకు 12మంది చొప్పున మొత్తం 48మంది క్రీడాకారులను సిద్దిపేట జిల్లా నుంచి ఎంపిక చేశారన్నారు. వీరంతా ఈనెల 13న సంగారెడ్డిలోని గిర్మాపూర్‌లో జరిగే ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు రవికుమార్, గోవర్ధన్‌రెడ్డి, ఫుట్‌బాల్ కోచ్ నర్సింహులు, వాలీబాల్ క్రీడాకారుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్, సిబ్బందిపై దాడి

వ్యక్తి అరెస్ట్

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్, సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈనెల 7న స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన చిట్టంపల్లి సురేష్ విధుల్లో ఉన్న డాక్టర్, సిబ్బందిని బూతులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించాడు. అనంతరం డాక్టర్ల ఫొటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి చెడుగా మాట్లాడినట్లు తెలిపారు. ఈ విషయంపై ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరి పరిస్థితి విషమం



బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఔరంగాబాద్ గేటు వద్ద వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న అవుసులపల్లికి చెందిన గొల్ల సిద్దయ్య కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని మెదక్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

బొలెరో, డీసీఎం ఢీ

డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

కంది(సంగారెడ్డి): డీసీఎం, బొలెరో ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని శివారులో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ హారిక కథనం ప్రకారం.. శంకర్ పల్లి నుంచి నారాయణఖేడ్‌కు గురువారం బొలెరో టమాట లోడ్‌తో వెళ్తోంది. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న డీసీఎం బొలెరోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో నడుపుతున్న డ్రైవర్ మనోజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గంజాయిని దహనం చేస్తున్న అధికారులు

రూ.1.34 కోట్ల విలువైన గంజాయి దహనం

పటాన్‌చెరు టౌన్: జిల్లాలోని వివిధ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లలో 26 గంజాయి కేసుల్లో పట్టుబడిన గంజాయిని దహనం చేశారు. గురువారం జిల్లా డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆదేశాల మేరకు.. జిల్లా ఎక్సైజ్ అధికారి పర్యవేక్షణలో ఇస్నాపూర్ పరిధిలోని మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పట్టుబడిన 143 కిలోల ఎండు గంజాయి, 623 గంజాయి మొక్కలు దహనం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దహనం చేసిన గంజాయి విలువ మార్కెట్లో రూ.కోటి 34 లక్షలు ఉంటుందని తెలిపారు.

విద్యార్థి మృతిపై కొనసాగుతున్న విచారణ

విచారణ అధికారిగా డిప్యూటీ కార్యదర్శి సహజ



గురుకులాల ప్రిన్సిపాల్స్‌తో డిప్యూటీ కార్యదర్శి సహజ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం(ఎస్)లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థి వివేక్ మృతిపై విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం గురుకుల పాఠశాలల డిప్యూటీ కార్యదర్శి సహజ విచారణ అధికారిగా హాజరయ్యారు. ఈ మేరకు పాఠశాలలోని ఉపాధ్యాయులతో పాటు ప్రిన్సిపాల్‌ను విచారించారు. విద్యార్థి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అలాగే తోటి విద్యార్థుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థి మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలించారు. అంతేకాకుండా రాత్రి సమయంలో డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయులు, వార్డెన్‌ల వివరాలు తీసుకున్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ లక్ష్మారెడ్డిలతో కలిసి సంఘటనపై చర్చించి సంఘటన సంబంధించి అంశాలను రాబట్టారు. ఈ మేరకు విచారణ నివేదికను గురుకులాల కార్యదర్శికి పంపించనున్నట్లు చెప్పారు. కాగా, విద్యార్థి మృతిపై కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాల మహానాడు నాయకుడు ఆరె కిశోర్ వినతి పత్రం అందించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.50లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు.

గురుకులాల ప్రిన్సిపాల్స్ సమావేశం..

తెలంగాణ గురుకులాల సొసైటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రిన్సిపాల్స్ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో గురుకులాల నిర్వహణ, నిధుల సమకూర్పుపై చర్చించినట్లు ప్రిన్సిపాల్స్ తెలిపారు. గురుకులాల్లో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టాలన్నారు. అలాగే పాఠశాలలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని ప్రిన్సిపాల్స్ డిప్యూటీ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు.

చోరీకి గురైన కంప్యూటర్లు లభ్యం

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో చోరీకి గురైన కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు గురువారం పాఠశాల ఎదుట ప్రత్యక్షమయ్యాయి. దసరా సెలవుల్లో పాఠశాలల్లో ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్లు చోరీకి గురవ్వగా ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్లూస్‌టీం సహాయంతో విచారణ చేపట్టారు. విచారణలో స్కూల్ అరకిలోమీటర్ దూరంలో కంప్యూటర్ కీబోర్డులు, మౌస్‌లు, చార్జర్‌లు దొరికాయి. ఆ తర్వాత విచారణ మరింత ముమ్మరం చేశారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున పాఠశాల గేట్ వద్ద 8ల్యాప్‌ట్యాప్‌లు, మూడు కంప్యూటర్లు లభ్యమయ్యాయి. సీఐ శ్రీను సంఘటన స్థలానికి చేరుకోని వాటిని స్వాధీనం చేసుకున్నారు.